తొలకు చారం

పాలనుగోటి కృష్ణారెడ్డి

"పోలీసోళ్ళతో. స్నేహం పనికిరాదు" అంటారు. కానీ బాల్య స్నేహితుడు పోలీసు ఉద్యోగంలో చేరితే ఆ స్నేహాన్ని కొనసాగించాలో, వదిలేయాలో ఎవరూ చెప్పినట్టులేదు.

నా బాల్య మిత్రుడు మోహన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరి నాలుగేళ్ళయింది. నేను ఉద్యోగరీత్యా బిజీగా వుండటం, మోహన్ ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలకు బదిలీ అవుతూ వుండడం వల్ల ఈ మధ్యకాలంలో మేమిద్దరం కలుసుకోలేదు కానీ, ఉత్తరాలు మాత్రం వ్రాసుకుంటూనే వున్నాం.

మోహన్ పని చేస్తున్న ఊరికి ప్రక్క ఊర్లో పని చేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు ఓ పది రోజుల క్రితం.

రాష్ట్రం మొత్తం మీద సంచలనం కలిగించిందా ఆత్మహత్య. కొన్ని చోట్ల సమ్మెలు, రాస్తారోకోలు,

బంద్‌లు జరిగాయి. మరికొన్ని చోట్ల నిరాహార దీక్షలు చేశారు.

ప్రభుత్వానికి కొద్దిగా సెగతగిలింది. ప్రాథమిక విచారణ జరిపించి, అతని ఆత్మహత్యకు ప్రధాన కారణం ఏ పోలీస్ అధికారి అని చెబుతున్నారో అతన్ని తప్ప చాలా మందిని అరెస్టు చేశారు.

అరెస్టు అయిన వాళ్ళలో ఎక్కువ మంది ఎస్.ఐ. మృతికి బాధ్యులైన వాళ్ళను శిక్షించమని కోరుతూ ఆందోళన చేసిన వాళ్ళే.

నాకెందుకో ఆ కేసు వివరాలు స్వయంగా తెలుసుకుందామనిపించింది. అలా అనిపించడానికి కారణం ఆ పక్క ఊళ్ళో మోహన్ వుండడమే, పైగా అతనూ అదే డిపార్ట్‌మెంట్ కావడం. ఈ రెండు కారణాల వల్ల ఆ కేసు నిజమైన వివరాలు పూర్తిగా తెలుస్తాయన్న నమ్మకం కలిగింది.

అందుకే ఆ రోజు సెలవు పెట్టి మోహన్ పనిచేస్తున్న ఊరికి వెళ్ళాను.

బస్టాండ్‌లో బస్ దిగి వెలుపలికి వస్తుంటే రిక్షా వాళ్ళ కేకలు వినిపిస్తూ వున్నాయి.

"ఆ ఎర్ర చొక్కానాది"

"ఆ పంజాబీ డ్రెస్ పిల్లనాది"

"ఆ కళ్ళజోడు నాది"

కళ్ళజోడు అని వినిపించే సరికి ఉలిక్కిపడ్డాను. చుట్టూతా చూశాను. నన్నే. నాకు పేరు పెట్టేశాడు. చేసేది ఏంలేక ముందుకు నడిచాను.

రిక్షా అతను నా దగ్గరకు వచ్చి "ఎక్కడికిపోవాలిసార్" అన్నాడు.

"పోలీస్ స్టేషన్ కొస్తావా?"

వాడిలో ఉత్సాహం కొద్దిగా తగ్గింది. నా వైపు ఎగాదిగా చూసి "మూడు రూపాయి లివ్వండి"

అన్నాడు.

"రెండు రూపాయిలిస్తాను"

"సరే ఎక్కండి"

నిజానికి పోలీస్ స్టేషన్ ఎంత దూరమో నాకు తెలియదు. మూడు అడిగాడు కాబట్టి రెండు ఇస్తానన్నాను. అక్కడ దిగాక గొడవ పెట్టుకోడు గదా! అదే అడిగాను అతన్ని.

"మీరు ఎవరి తాలూకు సార్"

"ఎస్.ఐ. గారి తాలూకు"

"మరి ఇంకేం సార్. మీ లాంటి వాళ్ళతో గొడవ పడితే మమ్మల్ని బ్రతకనిస్తారాసార్ పోలీసోళ్ళు.

వాళ్ళకి ఎవరి మీద కోపం వచ్చినా లాఠీ విసిరేది మామీదే గదసార్... ఎక్కువ డబ్బులు తరువాత సంగతి. మనం వెళ్లేసరికి ఎస్.ఐ. గారు బయట విల్చోనుంటే అసలు కిరాయి ఇవ్వనిస్తాడో లేదోసార్" అన్నాడు అనుమానంగా.

అతను పాపం అనవసరం సందేహపడడం ఎందుకని నా జేబులోంచి రెండు రూపాయిలు తీసి ఇచ్చాను ముందుగానే.

రిక్షాను పోలీస్ స్టేషన్ ముందు ఆపాడు. లోపలికి వెళ్ళాను. మోహన్ లేడు. బయటికి వెళ్ళాడట. "కూర్చో" అన్నాడు కానిస్టేబుల్ చాలా నిర్లక్ష్యంగా. కూర్చున్నాను.

నాకు కొంచెం దూరంలో ముగ్గురు పోలీసులు నేలమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. మోహన్ వచ్చే వరకు ఏం చేయాలో అర్థంకాలేదు. పేపర్ చూస్తునే పోలీసుల సంభాషణ వైపు దృష్టి మళ్ళించాను.

"వీడికి రంగంగుంటకు ట్రాన్స్‌ఫర్ వస్తుందట కదా"

"పదహారు వేల స్టేషన్‌ను వదిలిపెట్టి తొమ్మిదివేల స్టేషన్‌కు పోతాడంటావా"

"చెప్పలేం. తొమ్మిది వేల స్టేషనే గానీ, అక్కడ కేసులు ఎక్కువగా వుంటాయి. పైడబ్బులు బాగా వస్తాయి.

మొన్న వీడికి ఇరవై నాలుగువేల స్టేషన్‌కి ట్రాన్స్‌ఫర్ వస్తే నానా తిప్పలు పడి ట్రాన్స్‌ఫర్ ఆపించుకున్నాడు కదా వీడు" అన్నాడు మరో పోలీసు.

రంగంగుంట ట్రాన్స్‌ఫర్ అనేసరికి నాకు గుర్తొచ్చింది. వీళ్ళు మాట్లాడుకునేది మోహన్ గురించేనని. నేను మోహన్ మిత్రుణ్ణని తెలిసికూడా నా ముందే అతని గురించి వాళ్ళు అలా మాట్లాడుకోవడం నాకు చాలా బాధ అనిపించింది.

ముళ్ళమీద కూర్చున్నట్టుగా కూర్చున్నాను. కొద్ది సేపటి తరువాత మోహన్ వచ్చాడు. అప్పటి వరకు అతన్ని గురించి తక్కువగా మాట్లాడుకుంటున్న పోలీసులు అత్యంత వినయంగా, భయం భయంగా లేచి సెల్యూట్ చేశారు. అవేం పట్టించుకోకుండా మోహన్ నేరుగా నా దగ్గరకు వచ్చి కుశల ప్రశ్నలు వేసి, "ఐదు నిముషాలు ఆగు. ఇక్కడ పని ముగించుకుని వచ్చేస్తాను. ఇంటికి వెళదాం" అని "ఏయ్ వెంకట్రావ్ అందర్నీ ఒక్కసారి ఇటు పిలువు" అన్నాడు.

అంతా వచ్చి నిలబడ్డారు. "ఎవరెవరు ఏ ఏ డ్యూటీలో చెప్పండి" అన్నాడు. వాళ్ళల్లో ఒకతను చెప్పాడు. "సార్ డి.ఎస్.పి. దొరగారు ఇందాక ఫోన్ చేశారుసార్. మీరు రాగానే ఫోన్ చెయ్యమన్నారు".

"చేస్తాలే. ఆయనకేం పనిలేదు" అని ఎదురుగా నిల్చున్న వాళ్లని ఒక్కొక్కర్నే చూస్తూ "ఏం రంగయ్యా జుట్టు కత్తిరించుకోవడానికి టైం తీరకలేదా? ఆ కాలవపక్కనో, రోడ్డు పక్కనో ఎఫ్. ఎస్.గా కొట్టించుకోవడమే గదరా ఎందుకు చేయించుకోలేదు? బళ్ళ వాళ్ళ దగ్గర చిల్లర దొబ్బడానికే టైమ్ చాలడం లేదా?" అన్నాడు నవ్వుతూ.

రంగయ్య వైపు చూశాను. సుమారు యాభై ఏళ్ళ వుంటాయతనికి. అంటే దాదాపు మోహన్ వయసుకు రెట్టింపు. అంత పెద్ద వాణ్ణి పట్టుకుని మోహన్ అలా మాట్లాడటం నాకు నచ్చలేదు.

"నేను బయట వుంటాను. మీరు రండి" అని లేవబోయాను.

మోహన్ పెద్దగా నవ్వి "ఏం నీ ముందు తిడితే వాడు బాధపడతాడనా? మా వాళ్ళ సంగతి నీకు తెలియదులే. ఏరా రంగయ్య బాధపడతావా?"

"లేద్సార్" అన్నాడు వినయంగా.

మోహన్ ఏదేదో అడుగుతున్నాడు. అప్పటిదాక మోహన్‌ని తిట్టిన పోలీసులు ముగ్గురూ వినయంగా సమాధానాలు చెబుతున్నారు.

ఇంతలో ఫోన్ మ్రోగింది.

రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు.

అవతలి వైపు నుంచి మాట్లాడేదెవరో తెలుసుకున్నాడు.

అంతే! లేచి నిలబడి సెల్యూట్ చేసినంత పని చేసి "నమస్కారం సార్. ఇప్పుడే స్టేషన్ కొచ్చాను.

దొరగారు ఫోన్ చేశారా అని అడుగుతున్నాను.... దొరా... ఆ...ఆ...డి.ఎస్.పి దొరగారింటికి పంపమని చెబుతాను సార్" అని, ఫోన్ పెట్టేసి కూర్చున్నాడు.

అత్యంత వినయం ఉట్టిపడిన ఆ ముఖంలో మళ్ళీ క్రౌర్యం వచ్చేసింది. కానిస్టేబుల్ ఒకతను ఏదో చెప్పబోయాడు. "ఏడిశావ్ ముందు వెళ్ళి ఆ పనిజూడు." అని విసుగ్గా అందర్నీ వెళ్ళమని చెప్పి

"ఇంటికి పోదాం పద" అని బయలుదేరాడు.

ఇంతలో ఒక ప్రైవేటు సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చాడు.

"సర్ నాకు రెండు రోజులు లీవ్ కావాలి సార్. మా అమ్మా నాన్నలను చూసి రావాలి, ఇన్‌స్పెక్టర్‌గారిని అడిగితే మిమ్మల్ని అడగమని చెప్పారు" అన్నాడు వినయంగా.

"ఇప్పుడు గాదు. తర్వాత పోదువులే"

"ఏదో పనివుందట సార్. ఉత్తరం వ్రాశారు"

"ఉత్తరమే గదా! మరీ అర్జంట్ పని అయివుంటే టెలిగ్రామ్ ఇచ్చే వాళ్ళు లేదా ఫోన్ చేసేవాళ్ళు. అంత అవసరం అయి వుండదులే. వచ్చే వారం పోదువు"

"అది కాదుసార్. ఇంటికి తీసుకు వెళదామని పళ్ళు అవీ కూడా తీసుకున్నాను సార్".

మోహన్ నవ్వి "ఏదో కొన్నట్టుగా బాధపడుతున్నావు గదయ్యా. పళ్ళు ఆ అంగళ్ళలో దొబ్బినవే గదా. వెళ్ళి తినేయ్. వచ్చే వారం కావాలంటే నేను ఇప్పిస్తాన్లే పో" అన్నాడు.

అతనేదో చెబుతున్నా వినిపించుకోకుండా బయటకు నడిచాడు. బయటకు వచ్చాక నాతో అన్నాడు. "వీడు ఎం.ఏ. ఎం.ఫిల్. సెన్సిటివ్‌గా వుంటాడు" అన్నాడు.

"అది సరే మోహన్. నువ్వేమిటి ఇలా మారిపోయావ్. చదువుకునే రోజుల్లో ఎంత సున్నితంగా వుండేవాడివి".

"అది అప్పుడు సంగతి కదా. పోలీస్ డిపార్టుమెంట్‌లో చేరాక చర్మం మొద్దుబారక తప్పదు".

"అది సరే. నీకు తొమ్మిదివేల స్టేషన్‌కి ట్రాన్స్‌ఫర్ అన్నారు. అదేమిటో నాకు అర్థం కాలేదు".

"ఏం లేదు మనమేం లంచాలు తీసుకోకుండా నిజాయితీగా వుంటే ఆ వూళ్ళో లాడ్జీలు, బ్రాందీ షాపులు మొదలైన వాటి నుంచి వచ్చే నెలసరి మామూళ్ళు ఆ వూళ్ళో తొమ్మిదివేలు అయితే అదితొమ్మిదివేల స్టేషన్ పది వేలు అయితే పదివేల స్టేషన్. అది మా కోడ్ భాషలే. అవన్నీ ఇప్పుడెందుకు గానీ, సరదాగా కబుర్లు చెప్పు".

"కబుర్లు తర్వాత చెబుతాను. మొన్న ఆత్మహత్య చేసుకున్న ఇన్‌స్పెక్టర్ విషయం ఏమిటి? అతని ఆత్మహత్యకు కారకులైన వారి అందరి మీద యాక్షన్ తీసుకుంటున్నారా?"

"లేదు".

"మరి ఎస్.పి.గారు, డి.ఐ.జీగారు వచ్చి ఈ కేసు పూర్వాపరాలు అన్నీ విచారించాక ఇకపై ఇలాంటివి మళ్ళీ జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు!"

"అవును"

"తీసుకున్నారా?"

"తీసుకున్నారు"

"ఏం చేశారు. వేధించే వాళ్ళందర్నీ శిక్షిస్తామని చెప్పారా?"

"లేదు"

"మరి"

"సున్నిత మనస్కుల్ని ఇక నుంచి పోలీస్ డిపార్టుమెంట్‌లోకి తీసుకోకూడదని నిర్ణయించారు"

"అదేమిటి... అలా మాట్లాడతావ్? చనిపోయింది కూడా ఒక పోలీస్ ఆఫీసరే కదా!"

"నిజమే. ఇతను చనిపోవడానికి ఇంకెవరైనా కారణం అయివుంటే ఇది వరకు ఏం చేసే వాళ్ళమో నీకు తెలియదా? నువ్వు పేపర్లో చూస్తుంటావు కదా. కొన్ని గ్రామాల్లో పోలీసుల మీద ప్రజలు తిరగబడితే, తప్పు పూర్తిగా పోలీసులదే అయినా ఏం చేస్తాం? ఊళ్ళో వున్న మొలతాడు కట్టిన మగాణ్ణల్లా తీసుకువచ్చి ఖాకీ డ్రస్సుంటే జ్వరం కాసేలా, చితక బాదేస్తున్నామా లేదా?

కాని ఇక్కడ అతను చనిపోవడానికి కూడా మరో పోలీస్ ఉద్యోగి కారణం అంటున్నారు కదా!

పోలీస్ అంటే ఎవరు? ప్రభుత్వం. ప్రభుత్వం తనను తాను రక్షించుకోక పోతే ఎలా?"